# పులులొస్తున్నాయి!



**ఆఫీసు** పని మీద బెంగుళూరు వెళ్ళి రమ్మనప్పుడు రామ్మూర్తి ఆనందంగా తల ఊపాడు. కారణం-అక్కడ ఆస్త్మాకు మంచి మందిచ్చే డాక్టరున్నాడు. అపైన చిన్ననాటి స్నేహితురాలు శారద ఉన్నది.

ఎన్నాళ్ళబట్టో వెళ్ళాలనే కోరికను ఇలా ఆఫీసువారు తీరుస్తున్నారు. టిక్కెట్ తెప్పించి మరీ ఇచ్చారు. అక్కడ చేయవలసింది పెద్ద ఏమీ లేదు. ఎప్పటినుంచో కంపెనీకి రావాల్సిన బాకీలు రెండున్నాయి. వాళ్ళను కలసి డబ్బులు వసూలు చేయాలి!

రెండు గంటలకు బెంగుళూరు ఎక్స్‌ప్రెస్.

వాన ఏ క్షణానైనా పడవచ్చు. ఎందుకైనా మంచిది ఓ అరగంట ముందు వెళ్ళటం...తరువాత దారిలో ఇబ్బంది పడేందుకంటే అదే ఉత్తమం...ఆదుర్దా తప్పుతుంది-అనుకుంటూ బ్రీఫ్‌కేసుతో ఆటోలో కూలబడ్డాడు రామ్మూర్తి.

ఫస్టు క్లాసు కంపార్టుమెంటు ఖాళీగా ఉన్నది. తన కుపేలో అయితే ఎవ్వరూ ఎక్కలేదు. అసలు ఎన్నాళ్ళయిందో ఆ పెట్టెలో మనుష్యు లెక్కి అన్నట్లుగా అరంగుళం మందాన దుమ్ము. ఒకటి నయం- ఫాను, లైటు పనిచేస్తున్నయి. వేసి చూసి తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. ఒక సీటు మీద దుమ్మును శుభ్రంగా పాత పేపరు తీసుకుని దులిపి బ్రీఫ్‌కేస్ పక్కన పడేసి కూర్చున్నాడు.

శారదను చూడాలి. శారదను చూసి చాలా రోజు లయింది. ఎలా ఉన్నదో? పేపరు చూస్తున్నా, ఆవిడ రూపమే అతడి కళ్ళ ముందు కనబడుతున్నది.

అలికిడయితే తలెత్తాడు రామ్మూర్తి. ఎవరో స్త్రీ. బంగారు తీగెలా ఉన్నది. తళుక్కుమన్నది. ఆమె వెనక మరో కుర్రాడు-తమ్ముడిలా ఉన్నాడు-దబదబా సామాన్లు సర్దేశారు. సీటు మీద దుమ్ము దులుపుకొని కూర్చున్నారు.

ఆ కుర్రవాడే పలకరించాడు రామ్మూర్తిని-"మీరు బెంగుళూరుదాకానా?"

"అవునండీ...మీరు?"

"మా సిస్టర్ వస్తోందండీ!"

"అలాగా!"

రామ్మూర్తి కొస్త ఇబ్బందిగా అటూ ఇటూ కదిలాడు. ఇంకా ఈ పెట్టెలో ఎవరైనా ఎక్కేవాళ్ళున్నారో, లేదో? తలుపు దగ్గర అంటించిన చార్ట్ ప్రకారం ఇంకో ఆడా మగా రావాలి. వాళ్ళు గనుక రాకపోతే? వింత ఆలోచన. ఇరవై నాలుగు గంటలూ ఈమెతో వంటరిగా ప్రయాణం చేయవలసి వస్తుందా?అలాంటి పరిస్థితులే వస్తే-సంతోషమే. వెన్నెల్లా మెరిసిపోయే ఆ అమ్మాయితో వంటరిగా ఒకటో క్లాసు కుపేలో తలుపేసుకుని మరీ ప్రయాణం చెయ్యటం ఎవరికి ఆనందంగా ఉండదు? ఎవరు కోరుకోరు? కాని, గొడవేదైనా జరిగితే!

ఇక బయల్దేరుతున్నాం అన్నట్లుగా రైలింజన్ కూత వినబడింది. ఆ కుర్రాడు హడావిడిగా అక్కయ్యకు టాటా చెప్పి దిగిపోయాడు.

ఇద్దరే ఆ పెట్టెలో. ఇంకా మిగతా ఇద్దరూ ఎక్కనే లేదు: బహుశః కాన్సిల్ చేసుకొని ఉంటారు. గుండెలో గుబులు గుబులుగా ఉన్నది రామ్మూర్తికి. దొంగచూపుల్ని నివారించుకోలేక పోతున్నాడు.

"క్షమించాలి... ఇంకెవ్వరూ ఎక్కినట్లు లేదు. నన్నుగాని మరో పెట్టెలోకి మారి పొమ్మంటారా?" అన్నాడు చిన్నగా రామ్మూర్తి గొణుకుతున్నట్లుగా.

"నో...నో...దేనికండీ? ఏం ఫరవాలేదు. నాకూ ఒంటరిగా ప్రయాణం చేయటమన్నా భయమే.



మీకు అభ్యంతరం లేకపోతే కంపెనీ ఇవ్వండి!"

"థాంక్యూ!"

చదువుకున్న వాళ్ళకూ, చదువుకోని వాళ్ళకూ అదే తేడా అనిపించింది రామ్మూర్తికి. అలా అడిగి తను మంచిపని చేశాడు. తనే కావాలని అమ్మాయిలంటే కక్కుర్తిపడే కుర్రాడిలా ఆమె తనని గురించి ఇక అభిప్రాయపడదు.

"మీది బెంగుళూరా?"

"లేదండీ. నేను ఫార్మాస్యుటికల్ కంపెనీలో అసిస్టెంట్ సేల్స్ మనేజర్‌గా పనిచేస్తున్నాను. కంపెనీ పనిమీద వెళుతున్నాను. అందునా ఆ ఊరు మొదటిసారి వెళ్ళటం.మీరు..."

"నాకు బెంగుళూరు పాత ఊరే నండి. మా అన్నయ్య కొడుకు పుట్టిన రోజైతే వెళుతున్నాను!"

పుట్టిన రోజుకే ఇంత ప్రయాణమూ అంటే, బాగా డబ్బున్న మనిషిలా ఉన్నది అనుకున్నాడు రామ్మూర్తి."మీ అన్నయ్యకు ఒక్కడే కొడుకా!" అధాట్టుగా అన్నాడు. వాళ్ళ వంశానికి ఒక్కడే అయి ఉంటాడు లేకపోతే అంతదూరం అంత చిన్న ఫంక్షన్‌కి ఫస్టు క్లాసులో ప్రయాణంచేసి మరీ వెళ్ళాల్సిన అవసరం లేదేమో ననిపించింది.

ఆమె ఫక్కున నవ్వింది. నవ్వితే పండు వెన్నెల కురిసినట్లు అనిపించింది. "అదేం లేదు. మూడో వాడు. మా అన్నయ్యనుగూడా చూచి చాలా రోజులయింది. అందుకని ఈ వంకన బయల్దేరాను."

అటెండర్ వచ్చాడు- "కాఫీ కావాలా...డిన్నర్‌కు ఆర్డర్ ఇస్తారా?" అంటూ.

ఇద్దరూ కావాలన్నారు. డబ్బులు తీసుకొని పుస్తకంలో రాసుకొని వెళ్ళిపోయాడు.

"రైలు భోజనం బాగుంటుం దంటారా?" అడిగాడు రామ్మూర్తి నవ్వుతూ ఆమె మొఖంలోకి చూస్తూ.

"చక్కగా ఉంటుంది...రాయచూర్‌లో ఇస్తాడు.

'నేను సంవత్సరానికి రెండుసార్లు వెళుతూనే ఉంటా నుగదా!" అన్నది. "క్రితం సారే అనుకుంటాను... ఓ గమ్మత్తు జరిగింది. జోక్ హొటల్ భోజనం మీద కాదండోయ్!"

"చెప్పండి- ఏదైనా ఫరవాలేదు!"

మూ డయిందేమో ఎండ మండిపోతోంది. ఫాను వే సినా, వెచ్చటి గాలి, బయటి ఎండ పడకుండా షట్టర్స్ లాగేశాడు రామ్మూర్తి. "నా పేరు రామ్మూర్తండీ!"

"నా పేరు శాంత! ఆ రోజు గుర్తుకు వస్తుంటే ఇప్పటికీ నవ్వుతో నా కడుపు ఉబ్బిపోతుంది. ముందు చెప్పేస్తే గాని అగేలా లేదు!" వెనక్కు పడ్డ జడను ముందుకు లాక్కొని చివర్లు సర్దసాగింది. "పెట్టెలో నేను గాక మరో ఇద్దరు ఆడవాళ్ళు, ఓ చిన్న పిల్లవాడు. వాళ్ళు ముగ్గురూ ఎల్టీ సి మీద దేశాటనకు బయిల్దేరారు హైద్రాబాద్ నుంచి...ఇరవై రోజులు టూరు. శ్రావణ బెళగొళ,

# పి.యస్. నారాయణ




హలిబేడు, ధర్మస్థల, శృంగేరి, ఉడిపి, కన్యాకుమరి, మధురై ...అలా అలా తిరుపతి మీదుగా హైద్రాబాద్. పక్క కుపేలో నాలుగు టిక్కెట్లు...నా దాంట్లో మూ డు. మొత్తం ఏడుగురు. ఇలాగే వచ్చి అటెండర్ ఈవినింగ్ కాఫీకి నైట్ డిన్నర్‌కు రాసుకు వెళ్ళాడు. డిన్నర్ వచ్చే టైంకి పక్క

పెట్టెలో ఉన్న జనం కూడా నా పెట్టెలోకి వచ్చేశారు. కారియర్లు విప్పారు. నాకు వచ్చిన హోటల్ భోజనాన్ని తినని స్తేనా?"

"అదేవిటి! అంత గోలా?"

"అబ్బే కాదండీ. నిలువెత్తు కారియర్లు మూడు... దద్దోజనం, చక్కెర పొంగలి, పులిహోర!" ఫక్కున నవ్వింది శాంత. ఆమె నవ్వితే ఆ పెట్టెలో మరో దీపం వెలిగించాల్సిన అవసరం లేదనిపించింది. "బకాసురుడికి పెట్టినట్లుగా నాకూ ఓ ప్లేట్లో పెట్టి ఇచ్చారు."

"తెచ్చిన ప్లేటు తెచ్చినట్లే ఇచ్చేయవలసి వచ్చింది బేరర్‌కి. వాడు ఆశ్చర్యపోయాడు. తినలేదేమమ్మా అన్నాడు. తిన్నాను అన్నాను. బాగాలేదా అన్నాడు. బాగుందీ అన్నాను. అయితే అట్లా వదిలేశారేం అన్నాడు." ముత్యాలు రాలిపోతాయిమో నన్నట్లుగా కుడిచేతిని మాటిమాటికి నోటికి అడ్డం పెట్టుకుంటోంది.

విషయంలో నవ్వొచ్చేది లేకపోయినా, ఆమె చెప్పే తీరు రామ్మూర్తికి నవ్వు తెప్పిస్తోంది. ఆమెనే కళ్ళార్పకుండా చూస్తూ కూర్చుండిపోయాడు.

హైదరాబాద్ స్టేషన్‌లో వీచిన వాన గాలులు లింగంపల్లి వచ్చేటప్పటికి వేడిగాలుల్లా మారిపోయినయి.

చెరువులో అక్కడొకటి అక్కడొకటి ఉన్న కొంగల్లా...కొండల నడుమ మేడలు-జనం అంత వంటరిగా ఎలా ఉండగలుగుతున్నారా అనిపించేలా ఉన్నాయి...ప్రతి గుట్టమీద రాళ్ళు కొడుతూ ఆడా మగా కూలీలు.

"మీది హైద్రాబాదేనా?" రామ్మూర్తి అడిగాడు శాంతని.

శాంత నవ్వింది. "మానాన్నది తిరుచురాపల్లి. మాఅమ్మది అమలాపురం. ప్రస్తుతం మాది హైద్రాబాద్!"

"నాన్నగారు ఏం చేస్తుంటారు?"

"రావ్ అండ్ రావ్‌కు మానేజింగ్ డైరెక్టర్!"

"అంటే-"

"డిజైనర్స్ ఎండ్ డెకార్స్. హైదరాబాద్‌లో లీడింగ్ కంపెనీ అండి, బాబూ!" ఆ మాత్రం తెలియదా అన్నట్లు ఆ అమ్మాయి చూపులు.

రామ్మూర్తి నిజంగానే ఆ మాత్రం తెలియనందుకు చాలా ఫీలయి పోయి కుంచించుకుపోయాడు.

"మీ ఇల్లు చాలా బాగుండి ఉండాలి!" అన్నాడు నిముషం తరువాత కోలుకుని.

"బంజారా హిల్స్‌లో చాలా ఇళ్ళు మానాన్నగారి ఆధ్వర్యంలోనే కట్టబడినాయి. పొద్దున ఆరు తరవాత, రాత్రి పది లోపు మానాన్నగారు ఇంట్లో ఉండేది భోజనానికిగాను మధ్యాహ్నం పావు గంట మాత్రమే...అదైనా మా అమ్మ ఆయన కోసరం ఎదురుచూస్తూ తినకుండా కూర్చుని ఉంటుంది కాబట్టి!"

"అంత బిజీ అన్న మాట!"

దూరంగా పచ్చటి పొలాలు, మనుషుల కదలికలు. వెనక్కు వెళుతున్న గూడ్సు బండితో పక్క పట్టాల దడదడ.

శాంత పెట్టెలో నుంచి నాలుగు పుస్తకాలు తీసి బయట పడేసింది. అన్నీ ఇంగ్లీషువే. "చదువుతారా?"

"వద్దండీ...నా దగ్గరేవో తెలుగు పుస్తకాలున్నాయి!" నసుగుతున్నట్లుగా అన్నాడు.

"నా కెందుకో తెలుగు పుస్తకాలు చదవ బుద్ధికాదు, బాబూ..." అన్నది 'ఉమెన్స్ ఎరా' చేతిలోకి తీసుకుంటూ.


"మీవి కాన్వెంట్ చదువులాయె మరి!" రామ్మూర్తి అన్నాడు నవ్వుతూ.

"అనికాదు లెండి. నాకు తెలుగు వచ్చు!" మరోసారి నవ్వేసి పుస్తకంలో తల దూర్చింది శాంత.

పుస్తకం వెనుక ఆ అమ్మాయి ముఖాన్ని ఊహించుకుంటూ చాలా సేపు తన్ను తాను మరిచిపోయాడు రామ్మూర్తి. చిన్ననాటి శారద గుర్తుకే రావటం లేదు!

వికారాబాద్‌లో రైలు ఆగగానే అటెండర్ వచ్చి రెండు ఫ్లాస్కులతో కాఫీ ఇచ్చి వెళ్ళాడు.

"రైలు కాఫీ బాగుంటుం దంటారా?" రామ్మూర్తి ఆమెతో మాట్లాడట మంటే తన కెంతో ఇష్టం అన్నట్లు అడిగాడు.




"ఎదురుగ్గానే ఉన్నది గదా... తాగి చూడండి. ఇంకా ఆలోచన దేనికి?"

ఫ్లాస్కు తీసి కప్పులాంటి పైమూతలో కాఫీ పోసుకుని ఒక గుక్క తాగిం తరవాత ప్రాణం లేచి వచ్చింది. రైలు కాఫీలా లేదు... చిక్కటి కాఫీ... కానీ, రెండు కప్పు లున్నాయి... ఎక్కువవుతుందేమో ననిపించింది కాని, మళ్ళీ మళ్ళీ పోసుకు తాగేశాడు.

రామ్మూర్తికి శాంతను చూస్తుంటే మనస్సంతా ఆకాశవీథుల్లో విహరిస్తున్నట్లే ఉన్నది. అందం ఉన్నది... ఆస్తి ఉన్నది. చదువుకున్నది. అంత కుమించి ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో ఒంటరిగా ఎంత దూరమైనా ప్రయాణం చేయగల ధైర్యమున్నది..అలాంటి ఆ అమ్మాయికి ఈ ప్రపంచంలో ఎదురే లేదనిపించింది...

వీటన్నిటికీ కారణం... వెనుక ఉన్న డబ్బు. పెద్దవాళ్ళ హోదా!

ఆమె ముందు తను మర్రిచెట్టు పక్కన మొలిచిన పిచ్చి కుక్కలా అనిపించింది అంతరాంతరాల్లో...

రామ్మూర్తికి నీరస మావరించింది.

"రిట్జ్ హోటల్లో అనుకుంటాను... ఒక రోజు రాత్రి అయిస్‌క్రీమ్ తినాలనిపించి ఆటో పిలిచి ఎక్కి కూర్చున్నాను... ఆయనేమన్నా ఏదో బోర్డు మీటింగు ఉన్నది- రాత్రి పదికిగాని రాను అని ఫోన్ చేశారు... కారన్నా పంపలేదు!

"దేంట్లో నన్నారు వారు పని చేస్తున్నది?"

"ఏవో బాబు... రెండు మూడు కంపెనీలకు మానేజింగ్ డైరెక్టర్...పదింట్లో మామూలు డైరెక్టరు. వారూ మా నాన్నలాగానే నాకు కనబడేది ఉదయం ఎనిమిది లోపు రాత్రి మరీ పొద్దుపోయిం తరవాత ...అదీ ఏ మీటింగులూ లేకుండా ఉంటే! నే నయితే మా అమ్మలాగా చాదస్తంగా, మధ్యాహ్నంపూట భోజనం చేయకుండా ఉండను కాబట్టి ఆయన వస్తే వస్తారు, లేకపోతే లేదు."

"మీకు లైఫ్ బోరు కొడుతుండాలి!"

"అదేం లేదు? ! నేను హైద్రాబాద్‌లో ఉన్న లేడీస్ క్లబ్ అన్నింట్లోకీ మెంబరే... ఇవిగాక స్వచ్ఛంద సంస్థలు.. ఆ పైన మా కంపెనీల్లో పనిచేసే వర్కర్ల పిల్లల వెల్‌ఫేర్ అసోసియేషన్స్...ఒక్క క్షణం తీరిక ఉండదంటే నమ్మండి!"

"రిట్జ్ హోటల్లో సంగతి చెప్పనేలేదు." తను ఒకసారి బాలాజీ టెంపుల్‌నుంచి నడిచి వస్తూ గేటు బయటనుంచి పాలెస్‌లాంటి ఆ హోటల్‌ని చూచాడు.

"ఆఁ...రిట్జ్‌లో అయిస్‌క్రీమ్ తిందామనుకున్నాను గదా. ఆటోలో ఎక్కి అక్కడికి చేరేటప్పటికి ఎనిమిది గంటలయింది. ఓ టేబుల్ ఖాళీగా ఉంటే వెళ్ళి కూర్చున్నాను. నే నలా కూర్చున్నానో లేదో- ఫారినర్ లాగా ఉన్నాడు- ఒకతను వచ్చినా ఎదురుగ్గా కూర్చున్నాడు... మేడమ్! నా పేరు విలియమ్స్... మీ పేరు తెలుసుకోవచ్చా అన్నాడు." ష్యూర్! అన్నాను. నా పేరు శాంత అని చెప్పాను. ఎంత బాగుంది. గ్లాడ్ టు మీట్ యూ... అన్నాడు చేయి జాస్తూ."

"వాళ్ళకు అలవాటుగదా అది!" రామ్మూర్తి చిన్నగా నవ్వి అన్నాడు.

"నేను రెండు చేతులెత్తి నమస్కారం చేస్తూ 'నాకూ చాలా ఆనందంగా ఉన్నది' అన్నాను.

అయిస్క్రీమ్ తింటున్నాం ఇద్దరం. కరెంటు పోయింది. అతగాడు ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. నేను ఊఁ కొడుతున్నాను. ఉన్నట్లుండి నా చేయి పట్టుకున్నాడు ఆ చీకట్లో!"

"రియల్లీ!"

"జస్ట్ వన్ మినిట్ అన్నాను చాలా నెమ్మదిగా. చేయి వదిలాడు. కప్పులో నేను తినంగా మిగిలిన అయిస్క్రీమ్‌ను వాడి ముఖాన కొట్టా ఆ చీకట్లోనే. నాకు బాగా అలవాటే ఆ హొటల్! బయటకు వచ్చేశాను!" పగలబడి నవ్వసాగింది. "కరెంటు వచ్చిం తరవాత వాడి మొఖం ఎలా ఉందో ఎంక్వయిరీ చేసి కనుక్కుందామన్నా ఆ హాల్లో నాకు తెలిసిన వాళ్ళెవ్వరూ లేరు ఆ క్షణాన."

ఆమె నవ్వు ఎందుకో రామ్మూర్తికి చాలా భయంకరంగా ఉన్నట్లనిపించింది.తనని జాగ్రత్తగా ఉండమని హెచ్చరికా?గూడ లెగరేశాడు రామ్మూర్తి ఆమెనే చూస్తూ.

"ఎలా ఉన్నది తమాషా?"

"మంచిపని చేశారు. జన్మలో మరో ఆడదాని చేయి అతడు పట్టుకుంటాడని నేను అనుకోను. కనీసం పెళ్ళాందికూడా!" నాకూ నవ్వాగలేదు ఆ మాట అంటుంటే.

శాంత మళ్ళీ వగలబడి నవ్వింది. "జోక్...సూపర్బ్!"

ఎండకు మసి పూస్తున్నట్లుగా చీకటి పడుతోంది. రెండు మూడు నిమిషాలకు చిన్న గ్రామం. ఊరి బయట బావుల దగ్గర నీళ్ళు తోడుతున్న జనం... పడమటి వైపునుంచి చల్లటి గాలులు మళ్ళీ వాన వస్తుందేమోనన్నట్లుగా...

"రాయచూర్‌కి ఎన్ని గంటలకి వెళ్తాలి?"

"ఆకలవుతుంటే చెప్పండి- నా దగ్గర బిస్కెట్లున్నాయి!"

"మీ మాటలే కడుపు నింపుతున్నాయి. మళ్ళీ బిస్కెట్లుకూడా తిన్నానా అంటే బెంగుళూరు వెళ్ళేందాకా అన్నం తినే అవసరంకూడా ఉండదేమో!" నవ్వాడు.

"బెంగుళూరులో ఎక్కడుంటారు?"

శారద గురించి ఒక్క క్షణం చెబుదామా అనిపించింది గాని, ఆమెకు చెప్పటం అనవసరం అన్నట్లుగా- "ఏదైనా లాడ్జి చూచుకోవాలి!" అన్నాడు.

"మెజిస్టిక్ సెంటర్లో కావాల్సినన్ని."

"డీసెంట్‌గా ఉండే దేదైనా చెప్పండి."

"అన్నీ బాగానే ఉంటయ్యండి... అఫ్‌కోర్స్. నేనెప్పుడూ ఉండ లేదనుకోండి అక్కడ. రిసెప్షన్ కౌంటర్ చూస్తూనే ఆ లాడ్జి శోభ తెల్సిపోతుంది!" అన్నది చిన్నగా నవ్వి.

"స్టేషన్‌కు దగ్గిరేనా?"

"కనబడుతుంటుంది ఎదురుగా. నడిచి వెళ్ళవచ్చు. బ్రీఫ్ ఒక్కటే గదా మీ దగ్గిర ఉన్నది!"

"యా!"

రాయచూర్ స్టేషన్‌ను చూస్తూనే, "తయారుగా ఉండండి- వస్తోంది దద్దోజనం, చక్కెర పొంగలి... పులిహోర!" అన్నాడు రామ్మూర్తి నవ్వి, కవ్విస్తున్నట్లుగా.

"బాబోయ్! నాకు అది గుర్తు చేయబోకండి. నవ్వలేక చస్తాను. మళ్ళీ భోజనం ప్లేటు పిసరంత కూడా తినకుండా తిరిగి ఇచ్చేయ్యాల్సి వస్తుంది."

ఓ కుర్రవాడు వచ్చి రెండు ప్లేట్ల భోజనం, రెండు ఖాళీ గోల్డ్‌స్పాట్ సీసాలతో మంచినీళ్ళు పెట్టి వెళ్ళాడు. చేతులు కడుక్కున్నారు ఇద్దరూ.

"ఆవకాయ వేసుకుని అప్పడం నంచుకు తింటుంటే బాగుంటుందండీ!" అన్నాడు రామ్మూర్తి -శాంత ముఖంలోకే కళ్ళార్పకుండా చూస్తూ.

"కోడికూర అఖర్లేదా?"

"బాబోయ్... నేను స్ట్రిక్ట్ వెజిటేరియన్ని!"

"అలాగా... నేనూ అంతే. అసలు మసాలాలే తినను. అంత ఖచ్చితం!" నవ్వింది.

"నిమ్మకాయ కారంగా ఉన్నది. కూర ఉడకలేదు. సాంబారు బాగానే ఉన్నదనుకోండి. పెరుగు మధ్యాహ్నా మేసుకున్నట్లయితే చాలా బాగుండి ఉండేది." రామ్మూర్తి చేయి కడుకు వచ్చి కామెంట్స్ పాస్ చేయసాగాడు.

శాంత నవ్వేసి, "మీ కడుపు నిండిందా?" అడిగింది.

"శుభ్రంగా!"

పెద్దగా నవ్వేసింది. "అయితే, భోజనం బాగున్నట్లే!"

"మీదో?" అన్నాడు ఎగతాళిగా, తిన్న దెబ్బ నించి కోలుకుంటూ.

"నా పొట్టెంతండీ!" అంటూ ఎడం చేత్తో పొట్ట మీద కొట్టుకుంటూ వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళింది చేయి కడుక్కునేందుకు.

ఆమె ప్రవర్తన రామ్మూర్తిని కవ్విస్తున్నట్టే ఉన్నది.

ఆమె అవగతం కావటం లేదు. పాము అందంలాంటిదే శాంత అందంకూడా అనుకున్నప్పుడు రామ్మూర్తి కళ్ళు భయంతో మూసుకుపోతున్నాయి.

సీటు మీదకు బాక్ రెస్ట్ లాగి బెర్త్‌గా చేసుకుని, తల వైపు దీపం వెలిగించి పుస్తకం తెరిచాడు రామ్మూర్తి.

ఈ లోగా కుర్రవాడు రావటం, ఖాళీ ప్లేట్లూ సీసాలు తీసుకు వెళ్ళటం బండి బయల్దేరటం కూడా జరిగిపోయింది.

రామ్మూర్తి పుస్తకం చదువుతున్నా ,దొంగ చూపులతో శాంతను పరికిస్తూనే ఉన్నాడు.

రైలు వేగం పుంజుకున్న తరవాత శాంత లేచి, "ఇక డోర్ లోపల బోల్ట్ వేసేయమంటారా?" అన్నది.

తడబడ్డాడు ఒక్క క్షణం రామ్మూర్తి."ఒకె...ఒకె" అన్నాడు.

పుస్తకం పైనుంచి ఆమెనే చూస్తూన్న కళ్ళు తళుక్కుమన్నాయి.

వెనక్కు తిరిగి చేయెత్తి బోల్టు బిగిస్తున్న శాంత కంటే దేవలోకంలోని ఏ అప్సరసా అందగత్తె కాదూ అనిపించింది ఆ క్షణాన.

ఆమొదటి తరగతి రైలు పెట్టెలో తలుపులు బిగించుకొని తనూ, ఓ అపురూప సౌందర్యవతీ ఒంటరిగా ఓ రాత్రంతా గడిపి వేయబోతున్నామూ అనుకుంటుంటే-శారద ఎందుకు గుర్తుకు వస్తుంది?

ఆస్త్మాకు మందిచ్చే డాక్టరు ఎందుకు గుర్తుకు వస్తాడు?


ఇంత డబ్బు ఖర్చు పెట్టి బాకీ వసూలు చేసుకు రారా బాబూ అని పంపిస్తున్న కంపెనీ ఎక్కడ గుర్తుకు వస్తుంది? బాకీ లివ్వ వచ్చిన వాళ్ళు ఎందుకు గుర్తుకు వస్తారు?"

'దేవుడూ! థాంక్యూ... థాంక్యూ' అనుకుంటున్నాడు పదే- పదే మరో లోకంలో తేలిపోతూ రామ్మూర్తి.

"పంథొమ్మిది వందల ఎనభైరెండులో అనుకుంటాను... అప్పుడే హైద్రాబాద్‌లో బందిపోటుదొంగల బెడద మొదలయింది. బంజారా హిల్స్‌లో మాఇల్లు కాస్త పెద్దగా ఉంటుంది లెండి. అందుకే అయిదొంద లిచ్చి మాఇంటికి ప్రత్యేకంగా రాత్రిళ్ళు ఓ గుర్ఖానికూడా పెట్టుకున్నాం!"

చెప్పండి అన్నట్లుగా ఆమెనే చూస్తున్నాడు రామ్మూర్తి, ఆ గుడ్డి వెలుగులో.

ఓ రాత్రి పన్నెండు గంటలప్పుడు మేము అయిదొంద లిచ్చిన గూర్ఖా నోటికి కాళ్ళూ, చేతులకి గుడ్డలు కట్టి నలుగురు బందిపోటు దొంగలు వాళ్ళ ఖర్మ కొద్దీ ముందు నా గదిలోకే వచ్చారు.



"మైగాడ్!" 'రామ్మూర్తి నోరు తెరుచుకుని శాంతనీ చూస్తూ ఉండిపోయాడు.

"వాళ్ళనుకోవాలి ఆ మాట. మీరు గాదు!"

"ఏమైంది?" ఆత్రంగా అడిగాడు.

"ఏమౌతుంది! నా కుడిచేతి కత్తి లాంటి దెబ్బలకు బహుశః ఆ రోజుతోటే వాళ్ళంతా ఆ వృత్తిలో నుంచి రిటైరయి పోయి ఉండాలి!" అన్నది గర్వంగా, కళ్ళు మిల మిలా మెరుస్తూండగా.

"ఏం చేశారు?"

"చితక తన్నాను."

"నిజంగా.... మీ రొక్కరే!"

"నలుగు రని చెప్పాగదా. రెండు దెబ్బలకే ఇద్దరు కళ్ళు తిరిగి కింద పడ్డారు. మిగతా ఇద్దరూ హడావుడిగా వాళ్ళిద్దరినీ మోసుకుని వెనక్కు తిరిగి చూడకుండా పారిపోయారు!" ఫక్కున నవ్వింది.

ఆ నవ్వు... రామ్మూర్తి గొంతును పరపరా కోసేస్తున్నట్టుగా గిలగిలలాడాడు. భయంతో బిగుసుకుపోయాడు. అలా బిగుసుకుపోయే నిద్రలోకి జారిపోయాడు. ఆ పైన అంతా శూన్యం- దేవుడే మేలు చేశాడా అన్నట్టుగా.

కరువుతీరా నిద్రపోయి కళ్ళు తెరిస్తే సూర్యుడు పెట్టెలోకి జొరబడి మరీ వళ్ళంతా పేల్చేస్తున్నాడు. అయోమయంగా కళ్ళు నలుపుకుంటూ ఎనిమిది చూపిస్తున్న గడియారాన్ని,శుభ్రంగా తల దువ్వుకుని ఎర్రటి కుంకుమ బొట్టుతో తన వంకే చూస్తున్న శాంతని మార్చి మార్చి కళ్ళార్పకుండా చూడసాగాడు రామ్మూర్తి.

బుర్ర బరువెక్కిపోయింది.

ఈమెను చూచేనా భయపడి బలవంతంగా కళ్ళు మూసుకున్నది రాత్రి అనుకున్నాడు, వళ్ళు విరుచుకుంటూ. తన జీవితంలో బుద్ధి తెలిసిన తరువాత ఇంత అలస్యంగా లేచింది ఇదే మొదటిసారి అయి ఉండవచ్చు!

"బాగా ఆలస్యంగా లేవటం మీకు అలవాటా?" శాంత ఎగతాళిగా అడిగినట్టు అడిగింది.

"లేదండీ...ఎందుకో ఇవ్వాళే ఇలా జరిగింది." తడబడుతూ తల వంచుకున్నాడు రామ్మూర్తి. దీనికి కారణం మీరే అతిథామని నోటిదాకా వచ్చింది కూడా.

"ఇంకో గంటలో బెంగుళూరు వచ్చేస్తుంది. మా అన్నయ్యగారింట్లో చాలా హడావుడిగా ఉండి ఉండాలి!"

"ఇవ్వాళేగదూ అన్నట్టు...మీ అన్నయ్యగారి అబ్బాయి పుట్టిన రోజు!"

"అవునండీ...అప్పుడే కనీసం వందమందయినా వచ్చి ఉంటారు చుట్టాలు. ఇక రాత్రి దాన్నరుకు సరేసరి! నేను లేకపోతే వాడు కాలు కాలిన పిల్లిలా తిరుగుతూనే ఉంటాడు!" నవ్వుతూ అన్నది. "చూడండి...అంత హడావుడిలోగూడా ఇప్పుడు స్టేషన్‌కి స్వయంగా తనే వస్తాడు."

వాళ్ళ అంతస్థుకి రామ్మూర్తికి ఈర్ష్య కలిగిన మాట వాస్తవమే!"ఇంతకీ అల్లుడికి పుట్టిన రోజు కానుక ఏం కొన్నారు?"

"మా చెప్పుడే జూలో చూశాడుట పులి పిల్లని...కావాలని కూర్చున్నాడు...మొన్ననే మధ్యప్రదేశ్ నుంచి ఓ పదిహేను రోజుల పిల్లను మా అన్నయ్య తెప్పించాడుట...రెండువేల అయిదు వందలు అయిందంటే డి. డి. పంపాను!"

మాట్లాడకుండా లేచి భుజాన టవలు వేసుకొని, పేస్టు వేసిన బ్రష్‌ని నోట్లో పెట్టుకొని వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళాడు. కావాలని ఓ అరగంట అక్కడే కాలక్షేపం చేశాడు...శాంతకు ఎంత దూరంగా ఉంటే అంత హాయిగా ఉంటుం దని పించింది రామ్మూర్తికి.

సీటు దగ్గరకు వస్తూనే, "మీరు కాఫీ త్రాగారా?" అడిగాడు.

"నేను త్రాగాను. మీకోసరం రెడీగా ఉంచాను!"

కృతజ్ఞత నిండిన కళ్ళతో చూస్తూ, "మొహం కడుక్కోగానే కాఫీ పడకపోతే తలనొప్పి విపరీతంగా పుట్టుకొచ్చేస్తుందండీ!" అన్నాడు.

"మీకు వట్టి తలనొప్పేనేమో...నాకు జ్వరంకూడా వచ్చేస్తుంది!" పగలబడినవ్వింది రెండు చేతుల తోనూ దబదబా బాదుకుంటున్నట్టుగా నవ్వేసిందండి శాంత!

కిక్కురుమనకుండా కాఫీ తాగి,ఆమె చెబుతున్న మాటలకు అన్యమనస్కంగా 'ఊ' కొడుతూ కూర్చుండిపోయాడు రామ్మూర్తి. శారద అడ్రసు చూపించి దారి కనుక్కుందా మనుకున్నాడు గాని-ఎవరు, ఏమిటి అని లక్ష ప్రశ్నలు వేస్తుందే మోనని విరమించుకున్నాడు.

చెంగున లేడిలా లేచి నిలబడింది శాంత."అదుగో...బెంగుళూరు!"

** ** **

రైలు దిగుతూనే 'టాటా' చెప్పేసింది రామ్మూర్తికి. సామాన్లు పోర్టరు పట్టుకురాగా, ఆమె చెప్పినట్టుగానే వచ్చిన అన్నయ్య చేతిని ఆప్యాయంగా పట్టుకొని మరీ ఆ జనంలో ముందుకు దూసుకుపోయింది.

మెరుపు తీగలా మాయమయి పోతున్న ఆమెను ఇక జీవితంలో చూడలేనంత ఆబగా చూస్తూ రైలు పెట్టె తలుపు దగ్గరే సర్వం మరిచి నిలబడిపోయాడు రామ్మూర్తి.

స్టేషన్ బయటికొచ్చింతరువాత, "ఏమే! ఒంటరిగా ఫస్టు క్లాసులో రావడానికి భయం వేయలేదుటే?" శాంతను వాళ్ళన్నయ్య అడిగాడు.

"ఎవరో పాపం తను పనిచేసే కంపెనీ పని మీద బెంగుళూరు మొదటిసారి వస్తున్నాడు...మా కుపేలో నేనుగాక అతనొక్కడే...నిముషానికో కథ చొప్పున నూట తొంభై ఆరు కథలు చెప్పి ఊపిరి నలువుకోనీయకుండా ఉక్కిరిబిక్కిరి చేశాను. నోరు మెదిపితేనా? పిచ్చి నన్నాసన! భయంతో బిగుసుకుపోయా డనుకో. అతగాడిలాగానే నేనూ మా ఆఫీసు పనిమీద ఆఫీసు వారి ఖర్చుతో ఈ ఊరు వస్తున్నానని తెలిస్తే ఏం చేసేవాడో గానీ పాపం-నా దెబ్బకు సరిగ్గా కళ్ళొత్తి నా వంక చూస్తూ మాట్లాడితేనా?హైద్రాబాద్‌లో బండి కదిలి బెంగుళూరులో ఆగేటంతవరకూ పులి ముందు మేకలా గజగజలాడుతూ కూర్చున్నాడు-పూర్ చాప్!ఐ పిటీ హిమ్!" ●

